
ప్రజాశక్తి
శనివారం 26 నవంబర్ 2022
5
విజయనగరం



వైద్యుల రిలీవ్‌కు ఎపివివిపి కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా కేంద్రాసుపత్రి (మెడికల్ కాలేజీ)లో పనిచేస్తున్న ఎపి వైద్యవిధాన పరిషత్ వైద్యులను తక్షణమే రిలీవ్ చేయాలని ఆసుపత్రుల జిల్లా సమన్వయ అధికారి జి.నాగభూషణరావుకు ఎపి వివిపి కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. 'ప్రజారోగ్యంతో చెలగాటం... మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్వాకం' అనే శీర్షికతో 'ప్రజాశక్తి'లో గురువారం ప్రత్యేక కథనం వెలువడిన విషయం విదితమే. దీనిపై స్పందించిన కమిషనర్ వెంటనే రిలీవ్ చేయాలంటూ నాగభూషణరావుకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఇందుకు కోసం ప్రత్యేక అధికారాన్ని ఇస్తున్నట్టు తెలపడంతో వైద్యుల రిలీవ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే కేటాయించిన పోస్టుల్లో చేరేందుకు అనుగుణంగా రిలీవ్ ఆర్డర్లు సిద్ధం చేస్తున్నామని సమన్వయాధికారి ప్రజాశక్తికి తెలిపారు. దీంతో, జిల్లా వ్యాప్తంగావున్న ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రోగులకు అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. అక్కడ పనిభారంతో సతమతమౌతున్న వైద్యులకు ఊరట లభించనుంది. ప్రజాశక్తి కథనం, అనంతరం పరిణామాలపట్ల అటు వైద్యులు, ఇటు ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బొత్స మార్పుతో ఒరిగిందెంత?

● కీలక సమయంలో ఎందుకు తప్పించారో..!

● వైసిపిలో చర్చోపచర్చలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర కేంద్రం నుంచి విజయనగరం జిల్లా పార్టీ వ్యవహారాలు చూస్తున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను మార్చడం వల్ల పార్టీకి ఒరిగింది ఎంత? కీలక సమయంలో ఆయనను తప్పించడం వెనుక ఆంతర్యం ఏమిటి అన్న కోణంలో చర్చసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని సమీక్షించిన వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా, రీజనల్ స్థాయి ఇన్‌ఛార్జులను ఇటీవల మార్పుచేసిన విషయం విదితమే. అందులో భాగంగా విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాలో పార్టీ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న మంత్రి బొత్సను ఈసారి సొంత జిల్లా (విజయనగరం) బాధ్యతలనుంచి తప్పించడం, దీనికి బదులు అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా బాధ్యతలు కట్టబెట్టిన విషయం విదితమే. పార్టీ పర్యవేక్షణ బాధ్యతలను అవసరమైనప్పుడు మార్పులు, చేర్పులు చేయడం సర్వసాధారణమే. కానీ, నిర్దిపోతున్న ప్రతిపక్షం పురివిప్పుతున్న వేళ, అందులోనూ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ఆయన చూస్తున్న సొంత జిల్లా బాధ్యతల నుంచి తప్పించడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి వైసిపి జిల్లా పార్టీ యావత్తు బొత్స కనుసన్నల్లో నడుస్తోంది. నాడు కాంగ్రెస్ నుంచి నేటి వైసిపి వరకు ఇదేపంథా. పార్టీలో అందర్నీ ఐక్యం చేయాలన్నా, విభేదాలను సమసిపోయేలా చేయాలన్నా ఆయనకు ఆయనే సాటి. జిల్లాలో ఇప్పటికీ గ్రామ స్థాయి నాయకత్వంతో మెరుగైన సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బొత్సను జిల్లా బాధ్యత నుంచి తప్పించడం వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని, దానివల్ల ఎంతో కొంత నష్టమే ఉంటుందని ఆ పార్టీలోని సీనియర్లు చెబుతున్నారు. పేరుకు వైవి సుబ్బారెడ్డికి జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించినప్పటికీ, క్షేత్ర స్థాయి పరిస్థితులను చక్కదిద్దాలంటే తిరిగి బొత్సపై ఆధారపడక తప్పదని కూడా మరికొందరు అభిప్రాయ పడుతున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. జిల్లా పార్టీ పర్యవేక్షణ కాదు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు సైతం మన జిల్లాకు వచ్చేసరికి బొత్స జోక్యాన్ని తగ్గించి, సెకండ్ కేడర్‌ను బలోపేతం చేసేందుకు పార్టీ అధినేత వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకున్నారని కొందరు చెప్పుకుంటున్నారు. ఇప్పటి వరకు జరిగిన డిఆర్‌సి సమావేశాల్లో బొత్స చూపిన చొరవ, ఆయనకు ఇన్‌ఛార్జులు ఇచ్చిన ప్రాధాన్యతలే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లాలో బొత్స జోక్యాన్ని తగ్గించి, సెకండ్ కేడర్‌ను బలోపేతం చేసేందుకు పార్టీ అధినేత వ్యూహాత్మకంగా చర్యలు తీసుకుంటున్నారని కూడా చర్చ నడుస్తోంది. మరోవైపు జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు కూడా సీనియర్ నాయకుడే కావటంతో, బొత్స సేవలను పొరుగు జిల్లాలకు ఉపయోగించుకునేందుకు ఉండవచ్చని ఇంకొందరి వాదన. మొత్తానికి బొత్సను జిల్లా బాధ్యతల నుండి దూరం చేయడంపై కేవలం వైసిపిలోనే కాకుండా ఇతర పార్టీ నాయకుల్లోనూ చర్చనడుస్తోంది.

అర్హతున్న ప్రతిఒక్కరికీ ఓటు హక్కు

ఆదివాసీలు, కొత్త ఓటర్లపై ప్రత్యేక దృష్టి : సిఇఒ ముఖేష్ కుమార్ మీనా



సమావేశంలో మాట్లాడుతున్న సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి-విజయనగరం

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఛీఫ్ ఎలక్ట్రోలర్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలోని ఆదివాసీలు, కొత్త ఓటర్ల చేర్పింపుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2023 ప్రక్రియపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 17నుంచి 19 ఏళ్ల ఉన్నవారి విరాలు సేకరించి, వారందరికీ ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలను నిర్వహించి, విద్యార్థులను చైతన్యం చేస్తున్నామని చెప్పారు. స్థిర నివాసం లేని, ఇళ్లు లేనివారికి కూడా ఓటు హక్కు కల్పించనున్నట్లు తెలిపారు. సవర, గదబ తదితర ఆదివాసీల్లో 18 ఏళ్లు పైబడిన ప్రతీఒక్కరికీ శతశాతం ఓటుహక్కు కల్పించాలన్నది తమ లక్ష్యమన్నారు. ఇలాంటి గిరిజన తెగల జనాభా పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 10శాతం, విజయనగరం జిల్లాలో 9వేల మంది వరకు ఉన్నారని తెలిపారు. వీరికి ఓటుహక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సిఇఒ చెప్పారు.

ఖచ్చితమైన ఓటర్ల జాబితాను తయారు చేయండి

ఖచ్చితమైన ఓటర్ల జాబితాను తయారు చేయాలని, ఎన్నికల రిటర్నింగ్ అధికారులను, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులను సిఇఒ ఆదేశించారు. అధికారులతో జరిగిన సమావేశంలో, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని, అదే సమయంలో అనర్హులను తొలగించాలని సూచించారు. ముఖ్యంగా చనిపోయిన వారి పేర్లు ఎక్కువగా ఓటర్ల జాబితాల్లో ఉన్నాయని, వారి పేర్లు తొలగించమని కుటుంబ సభ్యులు దరఖాస్తు చేయకపోవడమే దీనికి కారణమని పేర్కొన్నారు. ఆయా కుటుంబ సభ్యులనుంచి ఫారమ్-7పై ధ్రువీకరణ తీసుకొని, చనిపోయినవారి పేర్లను తొలగించాలని సూచించారు. వ్యక్తులు వాస్తవంగా ఎక్కడ స్థిరంగా నివాసం ఉంటున్నారో, అక్కడి జాబితాల్లోనే వారి పేర్లను చేర్చాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటించి, పరిశీలన, పర్యవేక్షణ, తనిఖీ ద్వారా ఖచ్చితమైన ఓటర్ల జాబితాలు తయారవుతాయని సూచించారు. తుది జాబితా తయారీకి మరో 20 రోజులు వరకు సమయం ఉందని, ఈ లోగా అన్నిటినీ మరోసారి పరిశీలించి, తప్పులను సవరించి, ఖచ్చితమైన ఓటర్ల జాబితాలను తయారు చేయాలని సిఇఒ ఆదేశించారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు ఎంవి సూర్యకళ, శేష శైలజ, ఎం.అప్పారావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు సూర్యనారాయణ, సుదర్శనదొర, వెంకటేశ్వర్రావు, పద్మలత, ఎన్నికల సెల్ సూపరింటిండెంట్ మహేష్, వివిధ మండలాల తాశీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గొండయ్యపాలెంలో పోలింగ్ కేంద్రం పరిశీలన

డెంకాడ : ఓటు నమోదు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, అర్హులైన వారు ఎవరూ కూడా అవకాశం కోల్పోవడానికి వీలుగా లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ఆయన డెంకాడ మండలం మోదవలస పంచాయతీ పరిధిలోని గొండయ్యపాలెం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. సాధారణ, ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఫారం -6, 18, 19 లకు సంబంధించిన వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశ కాలంలో శత శాతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ సూర్యకళ, డెంకాడ, విజయనగరం తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

పిల్లల భవిష్యత్తు కోసమే తపన

కళాశాల బాలికల వసతిగృహాన్ని ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి- విజయనగరం

రాష్ట్రంలో పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తపన అని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బిడిఎల్) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులు రూ.1.50 కోట్లతో నగరంలోని సుంకరవీధిలో నిర్మించిన కళాశాల బాలికల వసతి గృహం నూతన భవనాన్ని ఉపసభాపతి శుక్రవారం ప్రారంభించారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వసతిగృహంలో అసంపూర్తిగా మిగిలిన భవనాల నిర్మాణాన్ని పూర్తిచేయడంతోపాటు ప్రహారీగోడ, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, విద్యార్థినులకు అవసరమైన ఇతర వసతులకోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ సాంస్కృతిక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన నగరాన్ని విద్యాకేంద్రంగా కూడా రూపొందించే లక్ష్యంతో వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యారంగంలో వెనుకబడి వున్న ఈ జిల్లాను ఈ సంస్థ దత్తత తీసుకొని రానున్న రోజుల్లో మరిన్ని వసతులు కల్పించేదిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, సాంఘిక సంక్షేమశాఖ డిడి సుధాకర్, సహాయ సంక్షేమ అధికారి రామానందం, వార్డు కార్పొరేటర్ జకీర్ పాల్గొన్నారు.

నేడు ఎస్‌సి కమిషన్ చైర్మన్ రాక

విజయనగరం : రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు చీపురుపల్లి చేరుకొని నీలికవాతు కార్యక్రమంతో పాటు, రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొంటారు.

27న స్వరాభిషేకం

విజయనగరం కోట : ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరు రాజేశ్వరరావు శత జయంతి సందర్భంగా ఈనెల 27న ఆనంద గజపతి ఆడిటోరియంలో స్వరాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీగురుపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బి.ఎ.నారాయణ తెలిపారు. మయూరి హోటల్‌లో శతజయంతి మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రముఖ గాయనీ గాయకులు పవన్ చరణ్, సురభి శ్రావణి, సంతోష్ కిరణ్, హారిక, బేబీ లావణ్య తమ గానామృతంతో అలరిస్తారని తెలిపారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ ఎన్.శ్రీనివాసరావు, హోటల్ మయూర అధినేత వై.బాబూరావు, సంస్థ అధ్యక్షులు జి.సన్యాసమ్మ పాల్గొన్నారు.

సచివాలయ స్థాయి వరకూ

లైంగిక వేధింపుల చట్టం కమిటీలు

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు / లైంగిక వేధింపుల నిరోధక కమిటీ భారీ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

లైంగిక వేధింపుల నిరోధక చట్టం మహిళలకు రక్షణ కవచం వంటిదని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు తెలిపారు. సచివాలయాల్లోను, వాలంటీర్లలోను మహిళలే అధిక సంఖ్య లో ఉన్నారని, అక్కడ కూడా లైంగిక వేధింపుల నిరోధక కమిటిలను ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళల లైంగిక వేధింపుల చట్టంపై భారీ ర్యాలీ జరిగింది. స్థానిక ఆర్అండ్‌బి నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన ఈ ర్యాలీని డిప్యూటీస్పీకర కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, నగర మేయర్ వి. విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ మహిళలకు భద్రత కల్పించడానికి వేధింపుల నిరోధక కమిటీ లు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో కూడా మహిళా భద్రత కోసం ఇంటి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఎ. సూర్య కుమారి మాట్లాడుతూ పదేళ్ల నుంచే బాయ్ ఫ్రెండ్స్, గర్ల్ ఫ్రెండ్స్ అంటూ పిల్లలు చెడు మార్గాలను పట్టకుండా చూసుకోవాలని తెలిపారు. తల్లి దండ్రులు పిల్లలతో ఎక్కువ సమయాన్ని గడపడం ద్వారా వారిలోని ఆత్మ న్యూన్యతను తొలగించవచ్చని అన్నారు. సిడబ్ల్యుసి కమిటీ చైర్‌పర్సన్ హిమ బిందు మాట్లాడుతూ హింస అంటే కొట్టడం తిట్టడమే కాదని, బాలల హక్కులను పొందక పోవడం కూడా హింస కిందకే వస్తుందని తెలిపారు. డిఎంహెచ్ఒ డాక్టర్ రమణకుమారి మాట్లాడుతూ డిఎంహెచ్ఒ డాక్టర్ రమణ కుమారి మాట్లాడుతూ పనిచేసే చోట మహిళలకు ఇబ్బందులుంటే బహిరంగంగా తెలియజేయాలని అన్నారు. ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 10 వరకు ఈ అవగాహనా సదస్సులు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ శ్రీ రాములు నాయుడు, డిఆర్‌డిఎ మెప్మా పీడీలు కళ్యాణ చక్రవర్తి, సుధాకర్, వైద్యాధికారులు . సిడిపిఒలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

హింస లేని సమాజానికై ఉద్యమించాలి : ఐద్వా



నినాదాలు చేస్తున్న ఐద్వా నాయకులు

విజయనగరం టౌన్ : హింసలేని సమాజకం కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణమ్మ అన్నారు. అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినం సందర్భంగా ఐద్వా ఆధ్వర్యాన ఎల్‌బిజి నగర్‌లో జి.పుణ్యవతి అధ్యక్షన జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. రోజురోజుకూ మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి 75ఏళ్లయినా ఆడపిల్లలకు సరైన విద్య, ఉపాధి, ఉద్యోగాలు లేవని అన్నారు. శ్రామిక మహిళాలకు సమానపనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. మరోపక్క మద్యం, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల ప్రభావం వల్ల యువత పక్క దారి పడుతున్నారని తెలిపారు. వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కృష్ణమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారికి పెద్దకష్టం

● తలకు వింతవ్యాధి

● చెన్నైలో వైద్యం కోసం రూ.50 లక్షల ఖర్చు

● దాతల సాయం కోసం ఎదురుచూపులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇంద్రజ

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన మీసాల అప్పలనాయుడు, కృష్ణవేణి కుమార్తె ఇంద్రజ పుట్టినప్పటి నుంచి తలకు వింత వ్యాధితో జన్మించింది. రెండేళ్లకు తల పెరగడంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రులకు తీసుకువెళ్లారు. న్యూరోతోపాటు శరీర భాగాలకు పరీక్షలు నిర్వహించారు. ఈ వ్యాధికి చెన్నైలో మాత్రమే వైద్యం ఉంటుందని, శస్త్రచికిత్సకు రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. కూలికెళ్తేనే గానీ పూటగడవని కుటుంబం వారిది. అలాంటిది అంతపెద్ద మొత్తం పెట్టలేమని అలానే జీవిస్తున్నారు. ప్రతినెలా రూ.వేలల్లో వైద్యం, మందుల కోసం ఖర్చవుతోంది. తమ ఆస్తిని కుమార్తె ఇంద్రజ వైద్యం, మందులు కోసమే ఖర్చు చేశామని, రూ.50 లక్షలు ఇంకెక్కడి నుంచి తీసుకురాగలమని తల్లిదండ్రులు వాపోతున్నారు. దాతలు సహకారం అందించాలని కోరుతున్నారు.



వింతవ్యాధితో బాధపడుతున్న ఇంద్రజ

చలించిన సిఎం

ఈ నెల 23న శ్రీకాకుళం జిల్లాలో బహిరంగ సభకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ బస్సులోనుంచి వింత వ్యాధితో బాధపడుతున్న ఇంద్రజను చూసి చలించిపోయారు. బస్సు దిగి నేరుగా ఆమె దగ్గరకు వచ్చారు. సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ, ఇంద్రజ తల్లిదండ్రులు ఇంద్రజ పరిస్థితిని సిఎంకు వివరించారు. ఇంద్రజ వైద్యం బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుందని, అన్ని విధాలుగా ఆదుకుంటానని సిఎం హామీనిచ్చారు. తక్షణమే శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లట్కర్‌ను కలవాలని సూచించారు. వెంటనే కలెక్టర్ ఛాంబర్‌కు పిలిపించారు. గురువారం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఇంద్రజకు తనిఖీలు నిర్వహించారు. వైద్య పరీక్షల నివేదికల ఆధారంగా వైద్యం కోసం ఎక్కడికి పంపించాలో చెప్పాలని డాక్టర్లను కలెక్టర్ ఆరా తీశారు.

ఎంపిడిఒ జి.కాశీవిశ్వనాథరావు, సచివాలయ ఉద్యోగులు ఇంద్రజ ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్యం కోసం దాతల సహకారం అవసరమని గుర్తించారు. ఇంద్రజ వైద్యం కోసం ప్రతిఒక్కరూ ఆర్థిక సాయం చేయాలని కోరారు. ముందుకొచ్చే దాతలు మజ్జి శ్రీనివాసరావు (9440433803)ను సంప్రదించాలని ఇంద్రజ తల్లిదండ్రులు కోరారు.

ప్రతినెలా టిడిఎస్ వసూలు చేయాలి

ప్రభుత్వానికి నిర్ణీత గడువులోగా చెల్లించాలి : ఇన్‌కమ్ టాక్స్ జాయింట్ కమిషనర్ శంకర్ పాండే



మాట్లాడుతున్న ఇన్‌కమ్ టాక్స్ జాయింట్ కమిషనర్ శంకర్ పాండే

ప్రజాశక్తి-విజయనగరం

ఉద్యోగుల నుంచి నెలనెలా టిడిఎస్ వసూలు చేయడమే కాకుండా, దానిని నిర్ణీత గడువులోగా కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాలని ఆదాయపుపన్ను శాఖ జాయింట్ కమిషనర్ శంకర్ పాండే కోరారు. టిడిఎస్ వసూలు చేసి చెల్లించడం, డిడిఒల కీలకమైన బాధ్యతల్లో ఒకటని ఆయన స్పష్టం చేశారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వ విభాగాల డ్రాయింగ్ అధికారులకు, టిడిఎస్‌పై అవగాహన కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాండే మాట్లాడుతూ, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు పన్నుల వసూలు చాలా ముఖ్యమని అన్నారు. పన్ను చెల్లించేవారితో పాటు, పన్నును వసూలు చేసే వారిది కూడా ఎంతో కీలక పాత్ర అని స్పష్టం చేశారు. డిడిఒలందరూ టిడిఎస్ వసూళ్లపై దృష్టి సారించాలని ఆయన కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు మాట్లాడుతూ, డిడిఒలంతాఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు ఎదరవ్వకుండా, వారి జీతాలనుంచి టిడిస్ వసూలు చేసి, సకాలంలో ప్రభుత్వానికి చెల్లించాలని సూచించారు. విశాఖపట్నం ఇన్‌కమ్ టేక్స్ జ్యూరిస్‌డిక్షన్ ఆఫీసర్ ఎన్.రేణుకాదేవి, ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ మాట్లాడుతూ, టిడిఎస్ వసూళ్లు, ప్రభుత్వానికి చెల్లించే విధానం, వివిధ రకాల ప్రభుత్వ నిబంధనలు, సెక్షన్లును, టిడిఎస్ వసూలు చేయాల్సిన ఆదాయ వివరాలను, రిటర్న్ ఫైల్ చేసే విధానాలను, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర ఉండదు

జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-బొబ్బిలి

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర పూర్తిగా ఉండదని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. బుడా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు నుంచి పూర్తిగా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని రైతులను కోరారు. కొనుగోలు కేంద్రాలకు కంప్యూటర్లు, తేమ యంత్రాలు పంపిణీ చేశామన్నారు. రైతులే రవాణా, గొనె సంచులు భరిస్తే రైతులు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలుపై రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

డిసెంబర్ నెలాఖరికి ఎంఐజి లేఅవుట్లు ప్రారంభం

డిసెంబర్ నెలాఖరు నాటికి ఎంఐజి లేఅవుట్లు ప్రారంభిస్తామని జెసి తెలిపారు. బొబ్బిలిలో పట్టణానికి ఐదు కిలోమీటర్లు దూరంలో లేఅవుట్ కోసం భూమిని పరిశీలించినట్లు చెప్పారు. డి-పట్టా భూమి ఉందని, భూమి కొనుగోలుకు నిధులు విడుదల అయిన వెంటనే కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి లేఅవుట్ వేస్తామని తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులకు లే అవుట్ స్థలాన్ని ఒకసారి చూపించి వారి అభిప్రాయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు 10శాతం రాయితీ ఉంటుందని, ఒకేసారి డబ్బులు చెల్లిస్తే మరో 10శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. సాలూరులో బంగారమ్మపేట, పార్వతీపురం అడ్డాపుశీల ప్రాంతాల్లో భూమి గుర్తించామన్నారు. బుడా పరిధిలో ప్రైవేట్ లేఅవుట్లు వేస్తే తప్పనిసరిగా బుడా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. కొత్తగా కురుపాం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాలను బుడాలో కలిసినట్లు చెప్పారు.

ఉత్సాహంగా వికలాంగుల క్రీడలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజీవ్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంబించారు. ముందుగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సకలాంగులతో సమానంగా అన్ని చోట్లా పోటీపడుతున్నారని, విజేతలుగా రాణిస్తున్నారని కితాబిచ్చారు. వచ్చే సంక్రాంతి సంబరాల్లో విభిన్న ప్రతిభావంతులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆసక్తి కలిగిన వారిని గుర్తించి భాగస్వామ్యం చేయాలని సంబంధిత అధికారులకు జడ్పీ ఛైర్మన్ సూచించారు. వివిధ అంశాల్లో తగిన తర్ఫీదు ఇచ్చి సంబరాల నాటికి సిద్ధం చేయాలన్నారు. అన్ని రకాల కార్యక్రమాల్లో విభిన్న ప్రతిభావంతులు కీలకపాత్ర పోషించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

క్రీడా పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల నుంచి పాఠశాలల నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో ఉత్సహంగా పాల్గొన్నారు.



పరుగు పోటీల్లో పాల్గొన్న వికలాంగ క్రీడాకారులు

అథ్లెటిక్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, 100 మీటర్ల పరుగు పందెం, సైక్లింగ్ తదితర క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి డిసెంబర్ 3వ తేదీన జరిగే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, చీఫ్ కోచ్ అప్పలనాయుడు, ఇతర అధికారులు, వివిధ సంస్థల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు



బాక్సింగ్ రింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

6వ రాష్ట్ర స్థాయి సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహంగా స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన క్రీడా అన్నారు. జిల్లా కేంద్రంలో రింగ్ ఏర్పాటు చేయడం, ప్రత్యేక మైదానం ఉండటం బాక్సింగ్ క్రీడాకారులకు వరం అని అన్నారు. అనంతరం పోటీలు అర్ధ రాత్రి వరకు జరిగాయి. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మణదేవ్, ఉపాధ్యక్షులు డోల మన్మధకుమర్, రింగ్ ఆఫ్‌ద సభ్యులు డి.నాగేశ్వరరావు, జిల్లా కోచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

జనసేనలోకి ఎంఎస్ఎన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎంఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత ఎం.సత్యనారాయణ (ఎంఎస్ఎన్) జనసేన పార్టీలో శుక్రవారం జనసేనలో చేరారు. తాటిపూడి దగ్గరలో ఉన్న గ్రీన్ బ్రీజ్ రిసార్ట్స్ లో జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ మాట్లాడుతూ యువత భవిష్యత్ కోసం నూతన రాజకీయాలకు శ్రీకారం చుట్టిన పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరానని, గతంలో ప్రజారాజ్యం పార్టీలోనూ, వైసిపి లో పనిచేశానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జనసేన గెలుపునకు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు ఆదాడ మోహనరావు, ఎం.సత్య నారాయణ, త్యాడ రామకృష్ణారావు(బాలు) పార్టీ పెద్దలు నాదెండ్ల మనోహర్ ను సత్కరించారు.

మెడికల్ కాలేజీ సత్వరమే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మెడికల్ కాలేజీని సత్వరం పూర్తి చేయాలని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు గదుల వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ డిమాండ్. శుక్రవారం జిల్లా సర్వ జన ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతి అందజేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు మాట్లాడుతూ ప్రజలకు న్యాయమైన వైద్యం అందాలంటే అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వైద్య సిబ్బందినిమ పెంచాలని కోరారు. పారిశుద్ధ్యన్ని మెరుగుపరిచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. మరో వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లాలో నాణ్యమైన వైద్యం అందాలంటే మెడికల్ కాలేజీ సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



తోటపల్లి కాలువ పక్కన చెమ్మకు నీరు చేరిన వరి పొలాలు

నిండా ముంచేసిన నిర్లక్ష్యం

వరి పంట మునకతో రైతుల ఆందోళన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని సతివాడ గ్రామంలో తోటపల్లి కాలువ ఆయకట్టు ఉంది. ఆ పరిధిలో ఇప్పటికే దాదాపు కోతలు పూర్తయ్యి, వరిచేనంతా పొలాల్లో ఉంది. ఇలాంటి తరుణంలో రైతులు వద్దన్నా, వినకుండా అధికారులు తోటపల్లి కాలువకు నీటిని విడుదల చేశారు. దీంతో కాలువ పక్కన ఉన్న వరి పొలాల్లో ఊటనీరు చేరింది. కోసి పొలాల్లో ఉంచిన వరిచేను అంతా తడిసి ముద్దయింది. సుమారు 30 ఎకరాల్లో పంట ముంపుబారిన పడింది. కుప్పలు పెట్టేలోపు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి, నీరు విడుదల చేయడంతో ధాన్యం రంగుమారి, మొలకెత్తే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్లో ప్రారంభంలో నీరు కావాలని అధికారులను అడిగితే కాలువలో గుర్రపు డెక్కలు, తుప్పలు ఉన్నాయని, వాటిని బాగుచేసే పరిస్థితి లేదని అధికారులు చెప్పారని, ప్రస్తుతం నీరు అవసరం లేదని చెప్పినా వదిలేశారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

సర్వే అడ్డగింత

వేపాడ : మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలోని మారిక గ్రామంలో శుక్రవారం సర్వే చేస్తున్న బృందాన్ని గిరిజనులు అడ్డుకున్నారు. తాతముత్తాతల నుంచి సాగుచేసుకుని జీవనోపాధి పొందుతున్న భూముల్లో ప్రయివేటు వ్యక్తులు సర్వే చేయడం ఏమిటని గిరిజనులు నిలదీశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాతబోయిన దేవుడు, పల్లి సోమేశ్, పి.రాములు, పి.పైడితల్లి, పెంటమ్మ, బొబ్బిలి దేవన్న, పల్లి జోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట డిపోను సందర్శించిన డిసిఎం

శృంగవరపుకోట : పట్టణంలోని ఆర్టిసి డిపోను డిప్యూటీ చీఫ్ మేనేజర్ కె.వెంకటరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డిపోలో అన్ని సెక్షన్లు పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. బస్సు స్టేషన్, పార్శిల్ కౌంటర్, స్టాళ్లు తనిఖీ చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట డిపో మేనేజర్ కె.రమేష్ ఉన్నారు.

సృజనాత్మకతను పెంచేందుకే సైన్స్ ప్రదర్శన

బొబ్బిలి : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు సైన్స్ ప్రదర్శన ఎంతో దోహదం చేస్తుందని వేణుగోపాల మున్సిపల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో శుక్రవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. మానవ శరీర నిర్మాణం, ద్రవాభిసరణం, జల చక్రం, మొక్కల పెరుగుదల, తదితర ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శన పెట్టారు. సైన్స్ ప్రదర్శనను ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు, విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పి.విజయలక్ష్మి, బి.శ్రీదేవి, ఎస్ను శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బొబ్బిలి : మున్సిపాలిటీలోని నాయుడుకాలనీలో సిసి కాలువలు, టిడ్కో లేఅవుట్లో కల్వర్టులకు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో మెరిసిన బాడంగి విద్యార్థులు

బాడంగి : వివిధ ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో బాడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వికలాంగ విద్యార్థులు సత్తాచాటారు. మానసిక వికలాంగుల విభాగంలో తెంటు భవ్యశ్రీ, అంధుల కేటగిరీలో ఎండవ ఇందు 50 మీటర్ల పరుగు పోటీల్లో తృతీయ స్థానాలు సాధించారు. వీరిని జిల్లా సహితవిద్యా సమన్వయకర్త సిరికి సూర్యారావు హెచ్ఎం త్రినాథరావు, ఎస్ఎస్ఎం రమేష్, ఉఐఇఆర్పి సత్యనారాయణ, ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు అభినందించారు.

చంద్రబాబును కలిసిన కోళ్ల దంపతులు

శృంగవరపుకోట : టిడిపి అధినేత చంద్రబాబునాయుడును శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు.

ఉపాధి పనుల పరిశీలన

గజపతినగరం : మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎపిడి టి.జనార్దన్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుడివాడ పంచాయతీలో చేపడుతున్న బౌండరీ ట్రెంచ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు తగు సూచనలు చేశారు. నిర్ణయించిన కొలతలకు అనుగుణంగా పనులు చేపట్టి, పనికి తగిన వేతనాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సిహెచ్.రామారావు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురంలో పంట కోత ప్రయోగం

గజపతినగరం : పొలంబడిలో భాగంగా శ్రీరంగరాజపురం గ్రామంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఎడి కె.మహరాజన్, ఏరువాక శాస్త్రవేత్త తేజేశ్వరరావు ఆధ్వర్యంలో వరి పంట కోత ప్రయోగం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరానికి సుమారు 24.80 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో చేపట్టిన పంట కోత ప్రయోగాల్లో సరాసరి 22 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఇక్కడ సుమారు 3 క్వింటాళ్ల దిగుబడి అధికంగా వచ్చిందని తెలిపారు. యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించడం వల్లే దిగుబడి పెరిగిందన్నారు. రైతులకు మొక్కజొన్నలో జీరోటిల్లేజ్ పద్ధతి ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్.ధనలక్ష్మి, విఎఎలు పవన్, వినయ్, ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

నెల్లిమర్ల : 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దారు కె.వి.రమణరాజు కోరారు. శుక్రవారం సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటు నమోదుపై తహశీల్దారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఈ నెల 9నుంచి వచ్చే నెల 9వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ వై.హేమంత్ కుమార్, విఆర్ఎ ఎన్.సూరిబాబు పాల్గొన్నారు.

రవికుమార్‌కు సన్మానం

శృంగవరపుకోట : టి-20 అంధుల ప్రపంచకప్ పోటీలకు దేశం తరఫున ఎంపికైన బొబ్బిలి మండలం రాముడువలస యువకుడు ఆమిటి రవికుమార్‌ని దాసరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉప సర్పంచ్ మోపాడ కుమార్, దాసరి సంక్షేమ సంఘం నాయకులు డికె నాయుడు, వసంత సత్యారావు ఆధ్వర్యాన రవికుమార్‌కు రూ.40 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మద్ది కృష్ణ, శేషు, మోపాడ శ్రీను, మునగపాక శ్రీను, పిరిడి సింహాచలం, మధు, వై.రాంబాబు, చిప్పాడ రమణ, వై.అప్పల సత్యం పాల్గొన్నారు.

పిసిసి అధ్యక్షుడి నియామకంపై హర్షం

ప్రజాశక్తి-విజయనగరం కోట

పిసిసి అధ్యక్షులుగా గిడుగు రుద్రరాజును నియమించడం పట్ల డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్ఎస్‌యుఐ లీడర్ నుంచి ఎమ్మెల్సీగా, ఎపిసిసి ప్రధాన కార్యదర్శిగా పని చేసి ఉన్నత విలువలు గల వ్యక్తిగా రుద్రరాజు గుర్తింపు పొందారని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీనివాసరావు, సూరిబాబు, షరీఫ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అతావుల్లా బాబా జయంతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సూఫీ మహనీయులు హజరత్ ఖాదర్ వలీ బాబా ప్రియ శిష్యులు హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా 86వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఖాదర్ బాబా దర్గా, దర్బార్ లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. అతావుల్లా బాబా తనయులు, ధర్మకర్త డాక్టర్ ఎమ్‌డి ఖలీల్ షరీఫ్ ఎటికె-వెలుగు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, వస్త్రాలు, పండ్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

'గడపగడపకు..'లో ఎమ్మెల్యేలు కడుబండి, శంబంగి

ప్రజాశక్తి-కొత్తవలస

పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మండలంలోని కాటకాపల్లి సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రతీ గడపలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. అర్హులెవరైనా ఉంటే సచివాలయాల్లో వాలంటీర్ల ద్వారా దరఖాస్తులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్.కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, గుమ్మడి సత్యనారాయణ, సర్పంచ్ పీతల కృష్ణ, చినరావుపల్లి సర్పంచ్ బూసాల దేముడు, ఎంపిటిసి పరదేశి నాయుడు, కల్లెంపూడి వెంకట్రావు, మిడతాన వెంకటరావు, వార్డు సభ్యులు అడిగర్ల సంతోష్, చిన్నం నాయుడు, ఐతంశెట్టి అనిల్ పాల్గొన్నారు.

బొబ్బిలి : పేదల అభ్యున్నతే లక్ష్యంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో 22, 23వ వార్డుల పరిధిలోని మిలిటరీ కాలనీ, రాజమహల్, రామన్నదొరవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్లు జి.రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఇంటి గోపాలరావు, కౌన్సిలర్లు తెంటు పార్వతి, కొర్లపు రామారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితోనే పార్టీకి మనుగడ

విజయనగరంటౌన్ : కార్యకర్తల కృషితోనే రాజకీయ పార్టీలకు మనుగడ ఉంటుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కష్టపడి పని చేయాలని దిశానిర్దేశం చేశారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి జంక్షన్ ప్రాంతంలో గల పార్టీ జోనల్ కార్యాలయంలో 37,38,39,42,43 డివిజన్లకు సంబంధించి పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం కష్టించి పని చేయాలని అన్నారు ఎల్లవేళలా ప్రజల మధ్యనే ఉండాలన్న ఉద్దేశంతో వార్డు పర్యటనలు చేశామని గుర్తు చేశారు ఏ రాజకీయ పార్టీ అయినా మనుగడ కొనసాగాలంటే కార్యకర్తలే ముఖ్యమని అన్నారు. జోనల్ ఇన్చార్జ్ డాక్టర్ విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రహితంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. సమావేశంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.





బొబ్బిలి, కొత్తవలస.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు

నగరంలో డిప్యూటీ స్పీకర్ పర్యటన

విజయనగరం టౌన్ : గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరంలోని 2వ డివిజన్ ఫూల్ బాగ్ కాలనీ లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శుక్రవారం పర్యటించారు. పాదాలమ్మ గుడిని దర్శించుకుని అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు మాట్లాడుతూ పథకాలు అమలు తీరుపట్ల లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సమస్యలను కూడా తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వజ్రపు శ్రీను. తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎయు విసి ప్రసాద్‌రెడ్డి

ఎఐదే కీలకపాత్ర

ఎయు విసి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-డెంకాడ

మన దైనందిన జీవితంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకపాత్ర పోషిస్తోందని ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి ప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని జొన్నాడ వద్దనున్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, స్ప్రింగర్ నేచర్ కంప్యూటర్ సైన్స్ జర్నల్ పబ్లికేషన్ ప్లాట్‌ఫాంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ అండ్ కమ్యూనికేషన్‌పై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్టప్‌ల వృద్ధికి సంబంధించి పరిశోధనలు చేయాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు అంకుర సంస్థలు నెలకొల్పడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయని చెప్పారు. ఐఐఐటి-కోటా సిఎస్ఇ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, డిజిపిసి చైర్‌పర్సన్ డాక్టర్ ప్రియాంక మిశ్రా మాట్లాడుతూ కీనోట్ స్పీకర్లు, స్ప్రింగర్ నేచర్ కంప్యూటర్ సైన్స్ జర్నల్ గురించి వివరించారు. అనంతరం ఎయు విసి ప్రసాద్‌రెడ్డిని లెండి కళాశాల ప్రిన్సిపల్ వివి రామారెడ్డి ఆధ్వర్యాన సత్కరించారు. కార్యక్రమంలో లెండి కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, సిఎస్ఇ హెచ్ఒడి ఎ.రామారావు, జి.ప్రకాశ్‌బాబు, ఎ.వి.పరాంకుశం, ఎం.రాజన్‌బాబు, కె.సుబ్రహ్మయ్య, సతీష్ పూజారి, ఆర్.రాజేందర్, జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

గ్రామసభలో గందరగోళం

బలవంతంగా భూములు లాక్కొంటున్నారని రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పోలవరం ఎడమ కాలువ భూ నిర్వాసితులతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం భూసేకరణ ఎస్‌డిసి బి.సుదర్శన్‌దొర ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ గందరగోళంగా మారింది. భూములను బలవంతంగా లాక్కొనేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలవరం కాలువకు భూమి ఇచ్చేది లేదని, పోలవరం కాలువ డిజైన్ మార్చాలని, లేకుంటే భూమికి భూమి ఇవ్వాలని రైతులు పట్టుపట్టారు. ఈ సందర్భంగా నిర్వాసితుల పోరాట కన్వీనర్ చల్ల జగన్ మాట్లాడుతూ పోలవరం కాలువ డిజైన్ మార్చేందుకు అవకాశాలున్నా, అధికారులు కుదరదని చెప్పడం దారుణమన్నారు. ప్రస్తుత డిజైన్‌తో చిన్న, సన్నకారు రైతులు రోడ్డున పడతారని ఆవేద వ్యక్తంచేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, పోలవరం ఎడమ కాలువ డిఇ లక్ష్మి సుధా, జెఇ డివి కీర్తి, కె.నిహారిక, సర్పంచ్ సంతోష్ కుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రూ 4.89 కోట్లతో రహదారి నిర్మాణం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర పంచాయతీ శివారు దబ్బగుంట నుండి దారపర్తి పంచాయతీ శివారు పల్లపుదుంగాడ వరకు పిఎంజిఎస్‌వై కింద రూ.4.89 కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భూమి పూజ చేశారు. అనంతరం దబ్బగుంట వద్ద నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారి నిర్మాణంపై గతంలో చాలా మంది హామీలు ఇచ్చారని, కానీ మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యేగా తనకు అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ రహదారి నిర్మాణం వల్ల దాదాపు 650 మంది గిరిజనుల 20 ఏళ్ల నిరీక్షణకు తెరపడుతుందని తెలిపారు. డోలీ కష్టాలు తీరుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌టిసి సభ్యురాలు ఎం.వెంకటలక్ష్మి , వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పినిశెట్టి వెంకటరమణ, పోతనాపల్లి వెంకటరావు, రెహమాన్, సర్పంచులు మీనా, సన్యాసిరావు, సుంకరి ఈశ్వరరావు, యాళ్ల రమణ, ఎంపిటిసి లగుడు లక్ష్మి, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, బొడ్డవర వైస్ సర్పంచ్ అప్పారావు, సత్యనారాయణ, శ్రీరాములు, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మైదానాల బాగుకు ప్రతిపాదనలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న గురుకుల విద్యాలయం, ఎపి మోడల్ స్కూల్ మైదానాలను బాగుచేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని డిఇఒ లింగేశ్వర్‌రెడ్డి.. అధికారులను ఆదేశించారు. ఇటీవల కలెక్టర్ సూర్యకుమారికి సమగ్ర శిక్ష ఎపిసి తప్పుడు నివేదిక ఇవ్వడంపై 'ప్రజాశక్తి'లో వచ్చిన 'మా పిల్లలు కాదు కదా!' అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిఇఒ శుక్రవారం ఆ రెండు మైదానాలను పరిశీలించారు. విద్యాలయాల మైదానాల్లో పిచ్చిమొక్కలు, రాతిబండల తొలగించడం, మట్టి వేయడం, సోలార్ దీపాలు ఏర్పాటు చేసేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా అంచనాలు వేసి, తనకు పంపించాలని ప్రిన్సిపాళ్లను డిఇఒ ఆదేశించారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు. విశాఖలో జరిగే పోటీల్లో పాల్గొనే గురుకుల విద్యార్థులకు రవాణా ఛార్జీల నిమిత్తం టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, నాయకులు సిరికి రమణ, వంటాకు శ్రీను అందించిన మొత్తాన్ని డిఇఒ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యు.ఉషారాణి, ఎస్ఒ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.



గురుకుల సిబ్బందితో మాట్లాడుతున్న డిఇఒ

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-డెంకాడ

మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ సి.పి.నందిని తెలిపారు. ఎంవిజిఆర్ డబ్ల్యుఇసి యూనిట్ ఆధ్వర్యాన శుక్రవారం మహిళా హింస వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, రాజ్యాంగంలోని హక్కులపై వివరించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.ఎల్.రాజు మాట్లాడారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎస్.మోహన్ కుమార్, డబ్ల్యుఇసి కన్వీనర్ డాక్టర్ సారా కమలా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని సింగరాయి గ్రామ సచివాలయంలో నిర్వహించిన లింగవివక్ష వ్యతిరేక కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. సచివాలయంలో వెబెక్స్ ద్వారా వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిరుజోగి వెంకటరావు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : మహిళలు, బాలికలపై జరుగుతున్న ఏ రకమైన హింసనైనా అంతం చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు జె.సి రాజు అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింసా, గృహ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణప్పవలస గ్రామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షల దగ్గర నుండి భ్రూణ హత్యలు, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, యాసిడ్ దాడులు... ఇలా అనేక రకాలుగా హింసకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇది ఒక సామాజిక సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని ఏ రూపంలో ఉన్నా అంతమొందించాలని కోరారు. అందుకోసం ప్రభుత్వాలు, పౌర సమాజం బాధ్యతతో, సామాజిక స్పృహతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.



డెంకాడ.. విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ నందిని

లక్షింపేట కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-వంగర

మండలంలోని లక్షింపేట దళితుల హత్య కేసు విచారణను డిసెంబర్ 30వ తేదికి వాయిదా వేశారు. శ్రీకాకుళం కోర్టు నుండి జడ్జి ఎం.శ్రీదేవి వర్చువల్ ప్రోగ్రాం ద్వారా శుక్రవారం విచారణ చేపట్టారు. మొత్తం 80 మంది నిందితులకు గాను 38 మంది లక్షింపేట ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. 34 మంది గైర్హాజరయ్యారు. 8 మంది మృతి చెందారు. సాక్షుల్లో ఒకరు హాజరయ్యారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి-జామి

పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటేష్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ మండల మహాసభ సందర్భంగా శుక్రవారం స్థానిక బాలాజీ కళాశాలలో విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో బోధన సిబ్బంది కోత విధిస్తూ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు, మెనూ ఛార్జీల పెంపు, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలంటే కాలం గడుపుతుందని విమర్శించారు. జిల్లాలో వేల సంఖ్యలో అమ్మఒడి లబ్ధిదారులకు కోత పెట్టారని, డిగ్రీ విద్యార్థులకు సరిగ్గా వసతి, విద్యా దీవెనలను విడుదల చెయ్యడం లేదని అన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చదివేందుకు పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటం చెయ్యాలని, అందుకు ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం జామి నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా షణ్ముఖ్, సాయి ప్రణీత్, ఉపాధ్యక్షులుగా రవి, సహాయ కార్యదర్శిగా జాను, యౌనిష్, గర్ల్స్ కన్వీనర్‌గా లలిత, కో - కన్వీనర్‌గా విజయ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు జె.రవికుమార్, ఎం.హర్ష పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించేందుకు శిక్షణ అవసరం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడానికి శిక్షణ అవసరమని ఎంఇఒ అంబళ్ల కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం సతివాడ మోడల్ పాఠశాలలో గుర్ల, నెల్లిమర్ల మండలాల ఉపాధ్యాయులకు అభ్యాసనాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. కృష్ణారావు మాట్లాడుతూ బోధన, సాధన రెండింటికీ సమప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.పద్మలత, డైట్ లెక్చరర్ ఎల్.రామ కృష్ణారావు, రిసోర్స్ పర్సన్ జి.అప్పలనాయుడు, టి.రాజేష్, ఎస్.రామకృష్ణ, ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని డిఇఒ లింగేశ్వరరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు విద్యనందించినప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని చెప్పారు. అందుకు శిక్షణ ఉపయోగ పడుతుందని తెలిపారు.

రేగిడి : విద్యార్థులకు పరిజ్ఞానం పెంపొందించేందుకే శిక్షణలు దోహదపడతాయని డిప్యూటీ డిఇఒ తిరుపతి నాయుడు, ఎస్ఆర్ జి ఎ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో ఉంగరాడ మెట్టవద్దనున్న అంబేద్కర్ గురుకులంలో 6,7,8 తరగతులకు సంబంధించి మాథ్స్, సైన్సు, సోషల్ బోధిస్తున్న రేగిడి, సంతకవిటి, వంగర మండలాల ఉపాధ్యాయులకు ఎంఇఒ ప్రసాదరావు ఆధ్వర్యాన శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బుచ్చిరాజు, పర్యవేక్షకులు ఎస్.జయకష్ణ, టి.షణ్ముఖరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కింబూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రేగిడి.. మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ తిరుపతినాయుడు

నేడు గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు, ఉత్సవ కమిటీ సభ్యులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణా బృందంతో కోలాటం, డప్పు వాయిద్యాలు, బాలనాగమ్మ బుర్రకథ, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

27న సిఎం కప్ క్రికెట్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో ఈనెల 27న సిఎం కప్ క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక చేపడుతున్నట్లు పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ఎస్.వెంకటనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న 17 ఏళ్లు నిండిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు సొంత క్రికెట్ కిట్లతో హాజరు కావాలని కోరారు.

హక్కుల కోసం ఉద్యమించాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

మాలలకు రిజర్వేషన్లు తీసివేయాలని రాజకీయ పార్టీలు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించడంపైఉద్యమించాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. శుక్రవారం చీపురపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లోగిశ మాట్లాడుతూ కొంత మంది ఉద్యోగాలు పొందడం, రాజకీయాల్లో ఉన్నతంగా ఉండడం వలన దేశంలో మాలలంతా గొప్పవారు అయిపోయారని భావించడం సరికాదన్నారు. మాలలకు రిజర్వేషన్లు తీసివేయాలని పార్లమెంట్‌లో ఓటు వేసిన అన్ని పార్టీలకు తగిన బుద్ధి చెబుతామన్నారు. అనంతరం కార్యకర్తలకు అంబేద్కర్ చిత్ర పటంతో కూడిన మాలమహానాడు 'టీ షర్టును' ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మలమహానాడు జిల్లా కార్యదర్శి చీడి రామకృష్ణ, దమరసింగి సింహాచలం, ఈశ్వరరావు, అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం నిర్వహించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఉదయం 11 గంటలకు రాజ్యాంగ పీఠికను చదివి ప్రమాణం చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో వున్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల అధికారులు ఉదయం 10.30 గంటలకు రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొనేందుకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంకు చేరుకోవాలన్నారు

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో బైకులు, కెఎల్‌పురంలోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా మల్లేశ్వరం గ్రామానికి చెందిన కుమ్మరి భాస్కరరావు (31) పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వన్‌టౌన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సిఐ బి.వెంకటరావు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిందితుడి నుంచి నాలుగు మోటారు సైకిల్లు, ఒక ఎల్ఇడి టివి, ఒక జత దిద్దులును రికవరీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీ పి.శ్రీకర్, ఎస్ఐలు అశోక్, భాస్కరరావు పాల్గొన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన ఎస్ఐ అశోక్, హెచ్‌సిలు ఆచ్చిరాజు, ఎ.రమణ, కానిస్టేబుళ్లు పి.శివ శంకర్, కె.శ్రీనివాసరావు, సిహెచ్. తిరుపతిరావును సిఐ వెంకటరావు అభినందించారు.